కుంటూవున్న గుండెకు శాంతి కలుగజేయాలని ప్రయత్నిం చేస్తూఉన్నాను. ఇంతలో 'ఏమండోయ్' అని కాంతం పిలిచింది.

'ఆఁ'

'ఇల్లారండి.'

'ఎందుకు? పనిమీదఉన్నా.'

'ఏంపని? రావాలి' అన్నది. వెళ్ళక తప్పిందికాదు. ఏమైనా కానీమని మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ లోపలికి వెళ్ళాను.

# ఇంట్లో విరహం

నాటకానికి వెళ్ళి వచ్చాను. నాటకంలో నాయికానాయకులు ఒకరినొకరు ప్రేమించుకొంటారు. ఒకరినొకరు వదలిఉండలేరు.

ఆ తరువాత ఎడబాటు కలుగుతుంది. నాయిక విరహతాపం అనుభవిస్తుంది. ముత్యాల హారాలు తెంపి పోస్తుంది. తుమ్మెదలనూ, కోకిలలనూ తిడుతుంది. చంద్రదూషణ చేస్తుంది. వెన్నెల వేడి భరించలేక బాధపడుతుంది. తాపజ్వరంలో సొమ్మసిల్లి పోతుంది. మన్మధుణ్ణి దూరుతుంది. దాసీలు పన్నీరుచల్లి మూర్ఛనుండి ఆమెను లేవనెత్తుతారు.

అటుతరువాత నాయకుడు రావటం అతన్ని అమాంతం తన కౌగిట్లో నలిపి వేయటం, ముద్దులు కురిపించటం జరుగుతుంది.

ఇవన్నీ చూశాను. ఆరాత్రంతా అదే ఆలోచన. జీవితం యొక్క మాధుర్యం అంతా అట్లా ప్రియురాలు ప్రవర్తించటంలో ఉందనుకొన్నాను. అటువంటి అనుభవాలు లేకపోతే జీవితం నిష్ఫలం అనుకొన్నాను. నాజీవితంలో అటువంటి అనుభవం కొంత కలపాలని నిశ్చయించుకొన్నాను.

ఇటువంటి రసానుభవానికి నేను నాయకుణ్ణి, కాంతం నాయిక అయినాము. అయితే కాంతానికి ఇటువంటి నాయికా లక్షణాలు నేర్పటం ఎల్లా! అదో పెద్దచిక్కు. నేను లేనప్పుడు విరహం అనుభవించు. చంద్రుణ్ణి తిట్టు. వెన్నెల వేడి అను. కోకిలనూ తుమ్మెదనూ తిట్టు. మెళ్ళో హారాలు, హారాలు లేకపోతే ఏముంటే అదే, తెంపిపోయి అని చెప్పితే కాంతం వింటుందా? వినటంమాట అట్లావుంచి నాకు ధైర్యంఏదీ?

కాబట్టి ఒకనాటకం చూపిస్తే, ప్రియుడు లేనప్పుడు విరహం అనుభవించాలని తెలుస్తుంది అని ఊహించి, మర్నాడు "కాంతం, ఈరోజు పెందలాడే వంటచెయ్యి. పిల్లలను మా అమ్మ కప్పజెప్పి మనం నాటకానికి వెడదాము" అన్నాను.

"నాటకానికి నేనెందుకులెండి. నాకు ఇంట్లోనాటకంచాలు. మీరు వెళ్ళండి సరదాగాఉంటే" అన్నది కాంతం పెద్ద పిల్లకు తల దువ్వుతూ.

"నేనుకూడా నాటకానికి వస్తానానాన్నా" అన్నది పెద్దపిల్ల.

ఈమాటలు వింటూ ఉన్న చిన్నది తేలుకుట్టినట్లు కెవ్వున కేకేసి ఏడ్వటం మొదలుపెట్టింది. పెద్దవాడు తనసంబంధం లేకుండా ఏమిటో జరిగిపోతున్నదని అనుకొని కామాలు చిందులు తొక్కటం ప్రారంభించాడు. "చూశారా? నాటకం, మనకు వేరేనాటకం ఎందుకు?" అన్నది కాంతం, గులాబిరేకులవంటి చెక్కిళ్లపైన గుంటలు పండేటట్లు నవ్వుతూ.

"నీకెందుకు నీవు వంటచెయ్యి" అన్నాను కాంతంతో. 'మనమంతా వెళ్ళుదాములే అమ్మా' అని పిల్లలతో అన్నాను.

రాత్రికి అందరం పెందలాడే భోజనం చేశాము. చిన్న పిల్లలందరూ నాటకంమాట మరచిపోయి నిద్రపోయినారు. పెద్దది మేకులాగ కూర్చున్నది నాటకానికి వెడదామని. కాంతాన్ని బలవంతంమీద కదలించుకొని తీసి కెళ్లేసరికి మంగళగిరిరథాన్ని కదిలించినంతటి ప్రయత్నమైంది.

౨

ఎట్లాగయితేనేం, కాంతానికి నాటకం చూపించి తీసు కొస్తున్నాను. ఇక ప్రేమతత్వం మెల్లగా బోధిద్దామని "సత్య భామకు కృష్ణునిమీద ఎంత ప్రేమో చూశావా" అన్నాను. "ప్రేమ ఉండదా, అబ్బరమా!" అన్నది కాంతం.

"భర్త రాక ఆలస్యమయితే ఎంత పరితపించిందో చూశావా?" అన్నాను.

"నాటకం కాదూ. నాటకాల్లో అంతే" నన్నది కాంతం.

"ఆకాన్త, ఎడబాటుకే ఓర్వలేక చంద్రుణ్ణి తిట్టి, కోవిలను దుమ్మెత్తిపోసి, "కళ్ళు కాయలుకాసినా" యని కీర్తన పాడింది చూశావా" అన్నాను.

"కీర్తన బాగానే ఉంది" అన్నది కాంతం.

"కీర్తన బాగుండటం కాదు. భర్తయందు ప్రేమ ఎట్లు చూపిందో చూశావా" అన్నాను.

"అవును చూశాను. కాని ఏమిటా వెధవచేష్టలు. హారాలు తెంపిపోసుకొని శుభ్రమైన పూలన్నీ నలగగొట్టుకొని వెధవ గందరగోళం అంతా చెయ్యకపోతే ప్రేమలేనట్లా ఏమిటి" అన్నది.

"అదికాదు. ప్రేమ ఉన్నవాళ్లు ఎడబాటుకు ఏమాత్రం ఓర్వలేరు. వాళ్లకు వెన్నెల చల్లగాఉండదు. వేడిగా ఉంటుంది. కోవిలపాట అసహ్యంగా ఉంటుంది" అన్నా.

"చూడండి, ఇదంతా పుస్తకాల్లో గోలేగాని నిజానికి కోయిల కూతే, పెద్దపాటనూ, అందులో హాయినా?"

"అల్లా కాదు. అల్లా ఉండాలె. భర్తృవియోగం కలిగినప్పుడు మాసిన చీర కట్టుకోవాలె. స్త్రీకి భర్త లేనప్పుడు తన శరీరంమీద తనకే అసహ్యం కలుగుతుంది. అల్లా ప్రవర్తిస్తేనే ప్రేమ చూపటం" అన్నాను. కాంతం బడికుర్రవాడిలాగ, నేను చెబుతుంటే విని ఊరుకొంది.

## 3

మర్నాడు కాంతానికి విరహబాధ కలుగజేసి రాత్రి చెప్పిన విషయాలు, కాంతం ప్రవర్తనలో ఏట్టి మార్పును, నూతనత్వాన్ని, తీసుకొస్తవో చూద్దామని అనుకొన్నాను. అందుకని "కాంతం, నేను ఊరికెళుతున్నాను. సాయంత్రం పదిగంటల దాకా రాను" అన్నాను.

"వెళ్లకపోతే నేమి? సెలవొస్తేసరి. ఎక్కడికో ఒక అక్కడికి దయచేస్తారు. కాళ్లు నిలవవు ఇంట్లో" అన్నది. కాంతం.

"నేను వెళ్లటం నీ కిష్టంలేదా" అన్నాను.

"ఏమాత్రం ఇష్టములేదు" అన్నది కాంతం.

ప్రియుని ఎడబాటుకు సహింపలేదన్నమాట, అని నాకు నేను చెప్పుకొని సంతోషించి, కాంతానికి వియోగం కలుగజేసి పూర్తిగా సత్యభామలాంటిదాన్నిగా తయారుచేద్దామని సంకల్పించుకొని వెళ్ళిపోయినాను.

సెలవురోజున హాయిగా ఇంట్లోబడి నిద్ర పోకుండా ఇదోటి రావటం మూలాన, స్నేహితుల యిండ్లలోనూ కాఫీహోటలు లోను క్లబ్బులోను కాలంగడపటం కష్టమైనా ఉత్కృష్టమైన కార్యాన్ని సాధించుకొరకు తాత్కాలికమైన చిన్నకష్టాలను లెక్కచెయ్యకూడదని అనుకొన్నాను.

పగలు గడిచింది. రాత్రి తొమ్మిదిదాకా ఎక్కడుండేది చలికాలంలో? ఇదో చిక్కు. ఏదైనా ఒక మంచిపని చేలయా

లంటే చిక్కులురావ్వా సరి. ఆమాత్రానికి లొంగిపోకూడదని నిశ్చయించుకొని సినిమాకు వెళ్ళి తొమ్మిదిన్నరదాకా అక్కడ గడిపి, అప్పుడు యింటిదారిపట్టాను.

కాంతం విరహబాధ, వియోగవేదన ఏమైనా పడుతూ ఉంటుందా అని ఆలోచనలోకి దిగాను. నాటకంలో చూచిందాయె. నేను చెప్పిన విషయాలు విన్నదాయె. ఇక కాకపోతే హంసతూలికాతల్పము లేదు. కాబట్టి చింకిచాపమీదనే శయనించి, అంత ఘోరంగా చంద్రదూషణ చేయకపోయినా కాస్త విచారిస్తూ అయినా ఉండదా అనుకొంటూ ఇంటికొచ్చాను.

తలుపు వేసి ఉంది. తలుపుదగ్గరకెళ్ళి, తలుపు, తలుపు అన్నాను. ఆవేశంగా అమాంతంగా రావటం, గాఢాలింగనంచే ప్రియుణ్ణి తృప్తిపరచటం జరిగితే బాగుండనుకొన్నాను. ఎంత సేపటికి తలుపు తియ్యదు. బైట వెధవ చలిగాలి, ఏమబ్బా కాంతం ప్రణయం చూపటంలేదు అనుకొన్నాను. ఇంతలో నాయిక ప్రణయకోపంలో తలుపు తీయకపోవటం కూడా కద్దు అని జ్ఞాపకం వచ్చి "ఓహో! అదిగామాలు ఇది" అని అనుకొని కొంచెం సంతోషించినాను. కాని ప్రణయకోపమైనా ఇట్టె పోవాలె. లేకపోతే మగాడికి కష్టంసుమండీ. వెధవచలి. వణుకొస్తుంది. నిజంగా సత్యభామలాగ ప్రణయకోపం అట్టే పట్టిందా చచ్చానే. అని అనుకొంటూ ఉండగానే వచ్చి తలుపుతీసింది కాంతం.

కాంతాన్ని చూచేసరికి కడుపు చెరువై పోయింది. వియోగబాధవల్ల కమిలిపోయిన మనిషి అట్లా ఉంటుందీ తెల్లనిచీర కట్టుకొని పూలుపెట్టుకొని, శుభ్రంగా.

తెగిపోయిన పూలహారాలు ఏవీ? మెడలో ఉన్న ఆడక్క గొలుసుగా, తెగకుండానే ఉంది.

ఛీ! నేను చేసిన ప్రయత్నం అంతా వ్యర్థం అయింది అనుకొన్నా. నలిపి మింగేద్దా మన్నంత కోపం వచ్చింది. కాని దిగమ్రింగుకొని,

"నా రాకకోసం పాపం ఎదురు చూస్తున్నావు కాబోలు" అన్నాను.

"ఎదురు చూడటం ఎందుకు ఊరికెళ్ళినవాళ్ళు రాక పోతారా!"

"అది గాదే. నీకు భర్తృవియోగం కలుగలేదూ ?" అన్నాను.

"కలిగితే నేం."

"కలిగితే విరహతాపం పుట్టాలె."

"నాకేం పుట్టలేదు."

"నాకర్మం, నీకు పుట్టక పోవటం. నాయందు నీకు ప్రేమ లేదన్నమాట. సత్యభామకు ప్రేమఉన్నది కాబట్టి అట్లా పుట్టింది ఆమెకు" అన్నాను.

"దానికేం వచ్చిందో, పిల్లాజెల్లాలేని ముండలకేముంది, అయినా ఏమిటీ గోల?"

"నామీద నీకు ప్రేమ లేదన్నమాటే కదూ?" అన్నాను దీనంగా.

"మహాబాగా కనిపెట్టారు. మధ్యాహ్నం పాపం ఫలహారం చేశారోలేదో. అన్నంతిందాము రండి. అల్లంపచ్చడి చేశాను... తరువాత పోట్లాడదాం" అన్నది.

భోజనం అయిన తరువాత "శాస్త్రసమయమేనా పైత్యం?" అన్నది కాంతం తమల పాకులకు ఈనెలు తీస్తూ; కాని అప్పటికే నాకోటి తోచింది. మనం ఆట్టే ఈవిరహం గిరహం ఆమె బుర్రలోకి ఎక్కిస్తిమా అంటే ప్రణయ కోపాలు నిజంగావచ్చినాయా, చలిలోను ఎండలోను వానలోను బైటపడి ఉండటం జరుగుతుందని జ్ఞాపకానికి వచ్చింది. అదీకాక ఆకలితో మాడిపోతూ నేను ఇంటికొస్తే, అప్పుడు వెంటనే ఇంత పచ్చడి అన్నం పెట్టింది. హాయిగాతిన్నాను. విరహమూ అవీ నేర్పామా అంటే చావే అని అనుకొని అయినా కాంతంతో బింకానికి "నీకు నిజమైనప్రేమ ఉంటే భర్తృవియోగం కోసం దుఃఖపడతూ ఉండవా!" అన్నాను.

"చాలుచాలులెండి, నాటకాలకు వెళ్ళొద్దంటే వినరుగా? చెపుతాను జరగండి" అన్నది. కాంతర్షిస్తే

# ప్ర ణ య లే ఖ లు

## ౧

మళ్ళీ అదేమోస్తరు. ఉత్తరం రావటంతోనే నాముఖం